

# ANAKAPALLI DISTRICT POLICE

## NEWSPAPER CLIPPINGS DT.02.04.2023

**ఈనాడు**
epaper.eenadu.net

### బాలిక మృతిపై విచారణ

రోలుగుంట, న్యూస్‌టుడే: స్థానిక కస్తూర్బా విద్యాలయానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని చిన్నారి అలియాస్ చిట్టెమ్మ మూడు రోజుల క్రితం గొలుగొండ మండలం చోద్యం వద్ద బొడ్డేరు చెరువులో అనుమానాస్పద స్థితిలో శవమై తేలింది. ఈ ఉదంతంపై రోలుగుంట, గొలుగొండ పోలీసులు ఉమ్మడిగా విచారణను ముమ్మరం చేశారు. అమ్మవారి పండగ నేపథ్యంలో ఆ బాలిక గత నెల 27న కేజీబీవీ గోడ దూకి వెళ్లినట్లు సిబ్బంది పోలీసులకు వివరించారు. కేజీబీవీలో రక్షణచర్యలు, శాంతిభద్రతల తదితర కోణాల్లో ఎస్సై బి.నాగకార్తిక్ ఆరా తీస్తున్నారు. గొలుగొండ ఎస్సై నారాయణరావు విద్యార్థినులు, సిబ్బంది నుంచి వివరాలను సేకరించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్సై నాగకార్తిక్

Date : 02/04/2023 EditionName : ANDHRA PRADESH( ANAKAPALLI ) PageNo :

ABN ఆంధ్రజ్యోతి

# 'బాలికలు మరింత దృఢ సంకల్పంతో ముందుకు సాగాలి'



కేజీబీవీలో కంప్లైంట్ బాక్సును పరిశీలిస్తున్న ఎస్ఐ నాగ కార్తీక్

**రోలుగుంట, ఏప్రిల్ 1 :** విద్య, ఆరోగ్యం, భద్రత విషయంలో బాలికలు అప్రమత్తంగా ఉండి, భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఎస్ఐ నాగ కార్తీక్ సూచించారు. రోలుగుంట కేజీబీవీ విద్యాలయంలో శనివారం బాలికలతో సమావేశమై వివిధ అంశాలపై కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రస్తుతం ఎదురవుతున్న సమస్యలను అధిగమించేందుకు ఎవరికి వారే అప్రమత్తంగా ఉండాలన్నారు. మానసికంగా మరింత దృఢంగా ఉండాలని కోరారు. విద్యాలయంలో ఎటువంటి సమస్యలు ఎదురైనా ఇక్కడ ఏర్పాటు చేసిన కంప్లైంట్ బాక్సులో రాసి వేయాలన్నారు. ప్రతి పదిహేను రోజుల కోసారి వాటిని తెరిచి, బాలికల సమస్యలపై సమీక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ తులసీ తదితరులు పాల్గొన్నారు.

Date: 02/04/2023, Edition: ANAKAPALLI(ANAKAPALLI DISTRICT), Page: 9
Source : https://epaper.andhrajyothy.com

ABN ఆంధ్రజ్యోతి

# తవ్వుకుపోతున్నా అడిగేవారేరి?

## దర్జాగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు

- పగలు, రాత్రి తేడా లేకుండా తరలింపు
- స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



అచ్యుతాపురం మండలం కూనిశెట్టి బలిజ వాని చెరువులో గ్రావెల్‌ను తరలించడానికి శుక్రవారం ఉదయం వచ్చిన ట్రాక్టర్లు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

**జిల్లాలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా అక్రమార్కులు దర్జాగా తవ్వుకుపోతున్నారు. గనులు, రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోక పోవడంతో వీరి దందా కొనసాగుతోంది. స్థానికులు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారుల్లో కదలిక లేదు. తాజాగా అనకాపల్లి మండలం తగరంపూడిలో, అచ్యుతాపురం మండలం దుప్పితూరు పంచాయతీలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు సాగుతున్నాయి.**



తవ్వకాలు జరపడంతో ఏర్పడిన గొయ్యి

అనకాపల్లి మండలం తగరంపూడి సర్వే నంబర్ 60లో కొండ పోరంబోకు ప్రభుత్వ భూమిలో గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. వైసీపీ గ్రామస్థాయి నేత ఒకరు తెర వెనుక ఉండి గత నెల రోజులుగా అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరిపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సమీపంలో జగనన్న కాలనీల పేరుతో అనకాపల్లిలో ప్రైవేటు నిర్మాణాల పునాదులు, ఇళ్ల స్థలాలు మెరక చేసేందుకు గ్రావెల్ తరలించి అమ్ముకుంటున్నారు. ట్రాక్టర్ లోడ్ రూ.1,500కు విక్రయిస్తున్నారు. రోజూ 40 నుంచి 50 ట్రాక్టర్ల లోడ్ గ్రావెల్ తరలిపోతున్నట్టు తెలిసింది. దీనిపై ఇటీవల గ్రామానికి చెందిన కొందరు గనుల శాఖ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు కనీసం అక్రమ గ్రావెల్ తవ్వకాల జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించలేదు. స్థానిక తహసీల్దార్, వీఆర్వోలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అయితే తగరంపూడి సర్వే నెంబర్ 60లో ప్రభుత్వ కొండపోరంబోకు భూమిలో గ్రావెల్ దందాపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి గ్రామాన్ని సందర్శించి గ్రావెల్ తవ్వకాలను పరిశీలించాలని గనుల శాఖాధికారులను ఆదేశించారు. ఫిర్యాదు విషయం తెలుసుకున్న వైసీపీ చోటా నేత గ్రావెల్ తవ్వకాలను నిలిపేసి, కొద్దిరోజులు రాత్రిపూట తవ్వకాలు జరిపారు. గత రెండు రోజులుగా మళ్లీ పగలు, రాత్రి తేడా లేకుండా గ్రావెల్ కొల్లగొట్టి ప్రైవేటు నిర్మాణాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

### అక్రమార్కులకు అడ్డేలేదు!

**అచ్యుతాపురం:** అచ్యుతాపురంలో గ్రావెల్ అక్రమ తవ్వకందారులు చెలరేగి పోతున్నారు. చెరువులు, కొండలు అనే తేడా లేకుండా పట్టపగలు తవ్వకాలు చేపట్టి తరలించుకుపోతున్నారు. ప్రత్యేక ఆర్థిక మండలిలో ఏర్పాటుచేస్తున్న వివిధ కర్మాగారాలతో పాటు రియల్టర్ల వెంచర్లలో పునాదులు కప్పడానికి గ్రావెల్ అవసరం అవుతుంది. దీంతో గ్రావెల్ అక్రమ రవాణా భారీగా పెరిగింది. ఇక్కడి ట్రాన్స్‌పోర్ట్ యజమానులు పార్టీలకు అతీతంగా గ్రూపుగా ఏర్పడి మండలంలో ఏదో ఒక ప్రాంతాన్ని ఎంచుకొని భారీ స్థాయిలో గ్రావెల్ తరలిస్తున్నారు. ఇటీవల బార్క్ భూముల్లోంచి పట్టపగలు గ్రావెల్ తరలించగా, గత రెండు రోజుల నుంచి దుప్పితూరు పంచాయతీ కూనిశెట్టి బలిజవాని ... మిగతా 8వ పేజీలో

Date: 02/04/2023, Edition: ANAKAPALLI(ANAKAPALLI DISTRICT), Page: 5
Source : https://epaper.andhrajyothy.com

ABN ఆంధ్రజ్యోతి

# తవ్వుకుపోతున్నా అడిగేవారేరీ?

... 5వ పేజీ తరువాయి

చెరువు నుంచి పగలు, రాత్రి తేడా లేకుండా ట్రాక్టర్లతో గ్రావెల్ తరలిస్తున్నారు. మామ్మూళ్లకు అలవాటు పడిన రెవెన్యూ సిబ్బంది అండదండలు పుష్కలంగా ఉండడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

## చెరువులో దర్జాగా తవ్వకాలు

సుమారు 80 ఎకరాల విస్తీర్ణంలో గల మండల కాంప్లెక్స్‌ని ఆనుకుని ఉన్న కూనిశెట్టి బలిజవాని చెరువులో దర్జాగా తవ్వకాలు జరుగుతున్నాయి. దుప్పితూరు పంచాయతీ పరిధిలో ఈ చెరువు ఉంది. అచ్యుతాపురం- పూడిమడక ప్రధాన రోడ్డును ఆనుకుని మండల కాంప్లెక్స్‌కి కూతవేటు దూరంలో ఉంది. అయినా అక్రమార్కులు ట్రాక్టర్‌ల ద్వారా యథేచ్ఛగా తరలిస్తున్నా అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. రోజూ అర్ధరాత్రి దాటిన తరువాత నుంచి వేకువజాము 5 గంటల వరకు ట్రాక్టర్లలో గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ట్రాక్టర్ గ్రావెల్‌ను రూ.1200కు విక్రయిస్తున్నారు. కాగా రెండు రోజులు క్రితం నాలుగు ట్రాక్టర్ల యజమానులు జంగులూరు జంక్షన్ వద్ద గల ఒక రియల్టర్‌తో ఒప్పందం కుదుర్చుకుని కూనిశెట్టి బలిజవాని చెరువు నుంచి మట్టి తవ్వకాలు ప్రారంభించారు. మొదటి రెండు రోజులు రాత్రి పూట తరలించి ఉదయం ట్రాక్టర్‌లను ఆపేసేవారు. అధికారులు పట్టించుకోకపోవడంతో శుక్రవారం పట్టపగలు తవ్వకాలు ప్రారంభించారు. ఈచెరువును అభివృద్ధి చేయడానికి సెజ్‌లో గల ఏసియన్ పెయింట్స్ యాజమాన్యం రూ.25 లక్షలు సీఎస్ఆర్ నిధులను మంజూరుచేసింది. దీంతో ఈ చెరువు చుట్టూ మట్టితో వెడల్పాటి రోడ్డును ఇటీవలే వేశారు. అయితే అక్రమార్కులు రోడ్డుకు వేసిన గ్రావెల్‌ను కూడా తవ్వుకుపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

Date: 02/04/2023, Edition: ANAKAPALLI(ANAKAPALLI DISTRICT), Page: 8

Source : https://epaper.andhrajyothy.com

సాక్షి

# పది పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

- జిల్లా నుంచి 23,913 మంది విద్యార్థులు
- 111 సెంటర్ల ఏర్పాటు..
  5 సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు
- ప్రత్యేక తనిఖీ బృందాల నియామకం
- రేపు ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలు

సాక్షి, అనకాపల్లి: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఇందు కోసం జిల్లా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. 3వ తేదీ నుంచి 18 వరకు జరగనున్న పరీక్షలకు జిల్లాలో 22,232 మంది రెగ్యులర్, 1,681 మంది ప్రైవేటు (వన్స్ ఫెయిల్డ్) విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్ష జరుగుతుంది. పరీక్షల నిర్వహణకు 111 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో అవసరమైన మౌలిక సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి కేంద్రంలో వసతి, ఫర్నిచర్, టాయిలెట్ సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా తాగునీటి సౌకర్యంతోపాటు, అన్ని కేంద్రాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. హాల్‌టికెట్ చూపించి విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు.

**సమస్యాత్మక కేంద్రాలపై ఫోకస్**

జిల్లాలో 111 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఇందులో ఏ– కేటగిరీ కింద 33, బీ– కేటగిరీ కింద 51, సీ–కేటగిరీ కింద 27 కేంద్రాలు ఉన్నాయి. వీటిలో సమస్యాత్మకంగా కేంద్రాలుగా ఐదింటిని గుర్తించారు. ఈ ఐదింటిపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. పరీక్షల నిర్వహణకు 111 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 111 డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను నియమించారు.

**ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు**

జిల్లాలో బఫర్ స్టోరేజ్ పాయింట్‌గా ఏఎంఎంఏ ప్రభుత్వ హైస్కూల్‌ను ఎంపిక చేశారు. ఇక్కడే



స్పాట్ వాల్యుయేషన్ కూడా జరగనుంది. ఇక్కడికే కట్టుదిట్టమైన భద్రత నడుమ పరీక్షల సామగ్రిని కేంద్రాలకు చేరవేశారు.

మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈసారి ప్రశ్నాపత్రాలపై ప్రత్యేక గుర్తింపు నంబర్‌ను ముద్రించారు. ప్రశ్నాపత్రం ఎక్కడ నుంచి బయటకు వచ్చిందనేది గుర్తించేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. రెవెన్యూ, పోలీస్, విద్యా విభాగాల నుంచి ఒక్కొక్క అధికారి వీటిలో సభ్యులుగా ఉంటారు. పరీక్ష జరిగే రోజుల్లో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశాలు ఇచ్చారు.

**3 నుంచే ఓపెన్ పరీక్షలు**

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు కూడా ఈనెల 3వ తేదీన ప్రారంభం కానున్నాయి. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరగనున్నాయి. జిల్లాలో 4 ఓపెన్ టెన్త్ పరీక్ష కేంద్రాల్లో 818 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. 9 ఓపెన్ ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో 1971 మంది పరీక్షలు రాయనున్నారు.

Date: 02 ... , Page: 9

సాక్షి

## సకల సౌకర్యాలు



పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి. ఎలక్ట్రానిక్ వాచ్, ఇతర వస్తువులు తీసుకురాకూడదు. పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలి. 8.45 గంటల నుంచి 9.30 గంటల వరకు అనుమతిస్తాం. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశాల మేరకు విద్యా, రెవెన్యూ, ఆర్టీసీ, పోలీస్, మెడికల్ విభాగ అధికారుల సహకారం తీసుకుంటున్నాం. పరీక్ష కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ తదితరాలతో మెడికల్ కిట్‌లు అందుబాటులో ఉంటాయి. పరీక్ష సమయానికి రెండు గంటల ముందు, రెండు గంటల తర్వాత వరకు ఆర్టీసీ బస్సు సర్వీసులు అందుబాటులో ఉండేలా చూడమని ప్రజా రవాణా శాఖను కోరాం.

–వెంకటలక్ష్మమ్మ, జిల్లా విద్యాశాఖాధికారి

Date: 02/04/2023, Edition: Anakapalle
(Anakapalle District), Page: 9
Source : https://epaper.sakshi.com/


ఈనాడు
epaper.eenadu.net




# అడ్డగోలు తవ్వకాలకు అడ్డేది?

అచ్యుతాపురం, న్యూస్‌టుడే

అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకుల అండదండలతో గ్రావెల్, మట్టి మాఫియా రెచ్చిపోతోంది. వారం వ్యవధిలో ఐదు గ్రామాల్లో అనుమతులు లేకుండా తవ్వకాలు, రవాణా చేపట్టడం గమనార్హం. వాడపాలెం పరిధిలో బార్క్ కోసం సేకరించిన అనాధీనం భూముల్లో ఓ గుత్తేదారు భారీగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టిన విషయం తెలిసిందే. ఒక్కరోజు తేడాలో ఎం.జగన్నాథపురం కొండ నుంచి వైకాపాకు చెందిన ఓ నాయకుడు పట్టపగలే గ్రావెల్ తవ్వకాలు, రవాణాకు శ్రీకారం చుట్టాడు. తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న దుప్పితూరు కూనిశెట్టిబలిజవాని చెరువులో ట్రాక్టర్లతో మట్టి తవ్వకాలు చేపట్టారు. వెదురువాడ, జంగుళూరు గ్రామాల్లో శనివారం కంకర, మట్టి తవ్వకాలు ప్రారంభించారు. పొక్లెయిన్లు, లారీలు, ట్రాక్టర్లు ఏర్పాటు చేసి పెద్దఎత్తున గ్రావెల్ రవాణా చేస్తున్నారు. అచ్యుతాపురం మండల కేంద్రానికి నాలుగు వైపులా గ్రావెల్ దందా జరుగుతున్నా.. అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. జంగుళూరు వైకాపాలో రెండు వర్గాలు ఉండడంతో ఒక వర్గం ఓ ప్రైవేటు లేఅవుట్‌కు రోడ్డు వేసేందుకు ఊర చెరువు నుంచి మట్టి తవ్వకాలకు పచ్చజెండా ఊపగా.. మరో వర్గం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో వీఆర్వో నూకరాజు మట్టి తవ్వకాలు చేస్తున్న ఒక పొక్లెయిన్, రవాణాకు వినియోగిస్తున్న ఐదు ట్రాక్టర్లను తీసుకొచ్చి పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. వెదురువాడ కొండలో గ్రావెల్ తవ్వకాలపై స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు సర్పంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు.



ప్రైవేటు లేఅవుటు రోడ్డు వేసేందుకు
వెదురువాడ నుంచి తరలించిన గ్రావెల్

Date : 02/04/2023 EditionName : ANDHRA PRADESH ( ANAKAPALLI ) PageNo :

epaper.eenadu.net

# ‘నిరుద్యోగులకు జగన్ మొండిచేయి’

అనకాపల్లి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని నిరుద్యోగులకు మొండి చేయి చూపారని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు విమర్శించారు. అనకాపల్లిలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు 2.33 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని నిరుద్యోగుల్లో ఆశలు కల్పించారన్నారు. నాలుగేళ్లు అవుతున్నా.. ఇచ్చిన హామీని అమలు చేయలేదన్నారు. ఒక్క ఉపాధ్యాయ పోస్టు భర్తీ చేయలేదన్నారు. రాష్ట్రంలో ఏటా నిరుద్యోగుల సంఖ్య పెరుగుతోందని, రాష్ట్రానికి ఒక్క పరిశ్రమా రాలేదన్నారు. రానున్న ఎన్నికల్లో వైకాపాకి బుద్ధి చెప్పేందుకు యువత సిద్ధంగా ఉందన్నారు. నాయకులు బాబర్, నరసింగరావు, జగన్‌మోహన్, భువనేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బుద్ధ

Date : 02/04/2023 EditionName : ANDHRA PRADESH ( ANAKAPALLI ) PageNo :

epaper.eenadu.net

# వైకాపా అరాచకాలను నియంత్రించాలి

చోడవరం, న్యూస్‌టుడే: వైకాపా అరాచకాలను నియంత్రించాలని భాజపా నాయకులు చోడవరంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. భాజపా జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్‌పై వైకాపా శ్రేణుల దాడిని ఖండిస్తూ భాజపా జిల్లా పార్టీ అధ్యక్షుడు పరమేశ్వరరావు సారథ్యంలో ఇక్కడి తహసీల్దారు కార్యాలయం ముందు నిరసన తెలిపారు. తహసీల్దారు తిరుమలబాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వరరావు మాట్లాడుతూ సత్యకుమార్‌పై దాడి హేయమైన చర్య అన్నారు. చర్యకు ప్రతి చర్య ఉంటుందని హెచ్చరించారు. రాష్ట్రాన్ని ఇబ్బంది పాల్జేయకూడదన్న భావనతో సీఎం జగన్‌పై పలు కేసులున్నా మా పెద్దలు కాస్త ఆలోచన చేస్తున్నారని, లేకుంటే మీ నాయకుడి పరిస్థితి ఏంటో తెలుసుకోండని వైకాపాకు హితవు పలికారు. చోడవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందర్ప రమణమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు అమర్‌నాథ్, నాయకులు దేవరపల్లి చంటి, గల్లా రాజేశ్వరరావు, చదరం నాగేశ్వరరావు, చిరిగిరి శెట్టి చిన వెంకయ్యదొర, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



చోడవరంలో తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు తదితరులు

Date : 02/04/2023 EditionName : ANDHRA PRADESH( ANAKAPALLI ) PageNo :

epaper.eenadu.net

# రాష్ట్రంలో అరాచక పాలన

## మాజీ మంత్రి అయ్యన్న

గొలుగొండ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వైకాపా పాలన అరాచకంగా సాగుతుందని మాజీ మంత్రి, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం పుత్తడిగైరంపేట, పాకలపాడులో 'ఇదేమి ఖర్మ.. మన రాష్ట్రానికి' కార్యక్రమంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరుస ఓటమిలతో జగన్‌రెడ్డి త్వరలో రాష్ట్రం వదిలి పోవడం ఖాయమన్నారు. అధికారం ఉందనే అహంకారంతో తప్పులను ఎత్తిచూపిన ప్రతి ఒక్కరిపై దాడులు, పోలీసు కేసులు పెట్టడడం మంచి పాలన అవుతుందా? అని ప్రశ్నించారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు ఆరిలోవ అటవీ ప్రాంతంలో రహదారి విస్తరణకు నిధులు మంజూరు చేసినట్లు గుర్తుచేశారు. అవసరమైన సొమ్ములు అందుబాటులో ఉన్నా ఇప్పుడున్న ఎమ్మెల్యే నాలుగేళ్లగా నిర్మాణం చేయించలేక వాహనాలు గోతుల్లో పడి పలువురు గాయాలు పాలవడం ప్రస్తుత సర్కారు ఘనతేనని ఎద్దేవా చేశారు. 2024లో గెలుపే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఈ నియంతను ఇంటికి సాగనంపేందుకు కృషి చేయాలన్నారు. పార్టీ మండలశాఖ అధ్యక్షుడు ఎ.అప్పలనాయుడు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు సాంబమూర్తి, సత్యనారాయణ, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అయ్యన్న పాత్రుడు

Date : 02/04/2023
EditionName : ANDHRA PRADESH( ANAKAPALLI )
PageNo :

epaper.eenadu.net

# పరిశ్రమలంటే పానీపూరీ బళ్లు కావు!

## మాజీ ఎమ్మెల్యే పీలా ఎద్దేవా



అనకాపల్లి, న్యూస్‌టుడే: మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు ఐటీ అంటే అర్థం తెలియదని మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ ఎద్దేవా చేశారు. పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తెదేపా హయాంలో అప్పటి ఐటీ మంత్రిగా లోకేశ్ ఐదు లక్షల ఉద్యోగాలు కల్పించారన్నారు. ప్రస్తుత ఐటీ మంత్రికి నూడిల్స్, పానీపూరి బళ్లను ప్రారంభించడమే తెలుసునని, వాటినే పరిశ్రమలని భ్రమపడుతున్నారన్నారు. పరిశ్రమల గురించి మినహా అన్ని విషయాలు మాట్లాడతారన్నారు. వైకాపా నేతల వేధింపుల వల్లే విశాఖ నుంచి పలు పరిశ్రమలు తరలిపోయాయన్నారు. తెదేపా అధికారంలోకి రాగానే ఏటా జాబ్ క్యాలెండర్‌ను అమలు చేస్తుందని పేర్కొన్నారు.

Date : 02/04/2023 EditionName : ANDHRA

epaper.eenadu.net

# తోటకూరపాలెం వైకాపాలో గలాటా!

రావికమతం, న్యూస్‌టుడే: తోటకూరపాలెంలో అధికార వైకాపాలో ఎంపీపీ పైల రాజు, సర్పంచి రుత్తల ఎరుకు సోమునాయుడు వర్గీయుల మధ్య వివాదం చోటుచేసుకొని కొట్లాటకు దారితీసింది. ఎంపీపీ వర్గానికి చెందిన దిలీప్ పంచాయతీలో అవినీతి జరుగుతోందని, ప్రతి పనికీ డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ సర్పంచి రుత్తల ఎరుకు సోమునాయుడుపై వాట్సాప్ గ్రూపులో పెట్టాడు. దీనిపై సర్పంచి వర్గీయులు పలుమార్లు ఆ యువకుడ్ని మందలించారు. అయినా వాట్సాప్ గ్రూపులో సర్పంచిపై ఆరోపణల పరంపర కొనసాగించడంతో ఆగ్రహించిన సర్పంచి బంధువులు, ఆయన వర్గీయులు గురువారం యువకుడిపై గొడవకు దిగి కొట్టారు. శ్రీరామనవమి రోజు రాత్రి ఇరువర్గాలు కొట్టుకున్నాయి. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై ఉమామహేశ్వరరావు సిబ్బందితో గ్రామానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టి వివాదం పెద్దదికాకుండా నియంత్రించారు. గ్రామంలో రాత్రికి పోలీసులతో పికెట్ ఏర్పాటు చేసినట్లు తెలిసింది. గొడవలపై ఫిర్యాదులు అందలేదని, వివాదాల జోలికి వెళ్లరాదని, కొట్లాడుకుంటే కేసులు నమోదు చేస్తామని యువకులను హెచ్చరించినట్లు ఎస్సై చెప్పారు.

Date : 02/04/2023 EditionName : ANDHRA PRADESH
( ANAKAPALLI ) PageNo :

ఈనాడు
epaper.eenadu.net

# 'నిరుద్యోగులను ముంచిన సీఎం'

**చోడవరం పట్టణం, దేవరాపల్లి, న్యూస్‌టుడే:** అధికారంలోకి రాగానే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.30 లక్షల ఉద్యోగాలను భర్తీ, ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి నిరుద్యోగులను సీఎం జగన్ నిలువునా మోసం చేశారని తెదేపా చోడవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు, తెదేపా మాడుగుల ఇన్‌ఛార్జి పీవీజీ కుమార్ ఆరోపించారు. శనివారం చోడవరంలో తాతబాబు, దేవరాపల్లిలో కుమార్ విలేకర్లతో మాట్లాడుతూ నాలుగేళ్ల వైకాపా పాలనలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో సీఎం జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కమీషన్ల కక్కుర్తితో మూడున్నరేళ్లలో రూ. 17 లక్షల కోట్ల పెట్టుబడులు పొరుగు రాష్ట్రాలకు తరిమేసి 34 లక్షల మంది యువత ఉపాధికి గండి కొట్టారన్నారు. అమరావతి నిర్మాణంలో 15 లక్షల ఉద్యోగాలకు తెదేపా శ్రీకారం చుడితే జగన్ అమరావతిని నిర్వీర్యం చేశారన్నారు. తెదేపా హయాంలో రెండుసార్లు డీఎస్సీ నిర్వహించి 18 వేల ఉద్యోగాలు ఇస్తే ఏటా మెగా డీఎస్సీ అన్న జగన్ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లలో ఒక్క ఉద్యోగం భర్తీ చేయలేదని చెప్పారు. తెదేపా హయాంలో చంద్రబాబు ప్రతి నెల ఆరు లక్షల మంది నిరుద్యోగ యువతకు రూ.2వేలు నిరుద్యోగ భృతి ఇస్తే సీఎం జగన్ రద్దు చేశారన్నారు. ఇకనైనా యువతను మోసం చేయడం మాని వెంటనే ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గూనూరు మల్లునాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కనిశెట్టి మత్యరాజ్, దేవరాపల్లిలో క్లస్టరు ఇన్‌ఛార్జి దొగ్గ దేముడు నాయుడు, జూరెడ్డి రాము, గుళ్లిపల్లి చిరంజీవి, అబద్ధం తదితరులు పాల్గొన్నారు.



నాయకులతో కలిసి మాట్లాడుతున్న తాతయ్యబాబు

Date : 02/04/2023 EditionName : ANDHRA PRADESH( ANAKAPALLI )
PageNo :

ABN
ఆంధ్రజ్యోతి

# బీజేపీ జాతీయ కార్యదర్శిపై దాడి పిరికిపంద చర్య

» గిరిజనమోర్చ రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు

**పాడేరు రూరల్, ఏప్రిల్ 1:** బీజేపీ జాతీయ కార్యదర్శి వైసత్యకుమార్‌పై అమరావతిలో వైసీపీ గూండాలు చేసిన దాడి వైసీపీ పిరికి పంద చర్య అని గిరిజనమోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కురసా ఉమామహేశ్వరరావు అన్నారు. ఐటీడీఏ కార్యాలయం ఎదురుగా ప్రధాన రహదారిలో శనివారం బీజేపీ ననాయకులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.రాజారావు మాట్లాడుతూ అమరావతిలో రైతులు నిర్వహిస్తున్న సమావేశానికి వెళ్తున్న సత్యకుమార్ కాన్వాయిపై వైసీపీ ఎంపీ సురేష్‌బాబుకు చెందిన గూండాలు దాడికి పాల్పడటం దుర్మార్గమైన చర్య అన్నారు. దాడి సమయంలో పోలీసులు అక్కడే ఉన్నప్పటికీ అడ్డుకోకపోవడం దారుణమన్నారు. దాడికి పాల్పడిన గూండాలతో పాటు ప్రోత్సహించిన ఎంపీ సురేష్‌బాబు అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

## పోలీసులు, బీజేపీ నేతల వాగ్వాదంతో ఉద్రిక్తత

ప్రధాన రహదారిపై బీజేపీ నేతలు వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాస్తారోకో చేయడంతో ఇరువైపులా కిలోమీటరు వరకు వాహనాలు నిలిచిపోయాయి. దీంత పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిరసనకారులను అరెస్టు చేసేందుకు ప్రయత్నించడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ, తోపులాట జరిగి ఉద్రిక్త వాతావరణానికి దారి తీసింది. నిరసనకారులు రోడ్డుపై బైఠాయించి వైసీపీ పార్టీ, పోలీసుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొంత సమయం తరువాత పరిస్థితి సద్దుమణగడంతో నిరసనకారులు అక్కడ నుంచి ర్యాలీగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. కార్యాలయంలోకి వెళ్లేందుకు సిద్ధమైన నాయకులను పోలీసులు మరోసారి అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. అందరినీ లోపలికి పంపించడం కుదరదని, పది మంది మాత్రమే వెళ్లి కలెక్టర్‌ను కలిసేందుకు అనుమతిస్తామని పోలీసులు స్పష్టం చేశారు. దీంతో పది మంది నాయకులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.కాంతకుమారి, కె.కృష్ణారావు, కె.రాజారావు, సల్లా రామకృష్ణ, రామచంద్రరావు, వేమన, గోపాలపాత్రుడు, భాస్కర్, మత్స్యకొండబాబు, టి.సత్యవతి, జె.సత్యవతి పాల్గొన్నారు.



ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

Date: 02/04/2023, Edition: ALLURI SEETHARAMARAJU(ALLURI SEETHARAMARAJU DISTRICT), Page: 8
Source : https://epaper.andhrajyothy.com

ABN ఆంధ్రజ్యోతి

## 'ధ్వంసమైన టీడీపీ జెండా దిమ్మను పునర్నిర్మించకుంటే ఆందోళన'



లారీ ఢీకొనడంతో ధ్వంసమైన టీడీపీ జెండా దిమ్మ

**నాతవరం, ఏప్రిల్ 1 :** మండల కేంద్రం నాతవరం మెయిన్ రోడ్డులో వారం రోజుల క్రితం లారీ ఢీకొనడంతో ధ్వంసమైన టీడీపీ జెండా దిమ్మను వెంటనే పునర్నిర్మించకుంటే ఆందోళన చేపడతామని స్థానిక టీడీపీ నాయకులు అంకంరెడ్డి శివ, శెట్టి నానాజీ, నాయుడు తదితరులు శనివారం స్పష్టం చేశారు. వల్సంపేటకు చెందిన లారీ ఢీకొట్టడంతో జెండా దిమ్మ ధ్వంసం కావడంతో వెంటనే తమ పార్టీ శ్రేణులు అడ్డుకోవడంతో ట్రాఫిక్ సమస్య వల్ల పొరపాటున ఢీకొనడం జరిగిందని సదరు డ్రైవర్ చెప్పాడన్నారు. నాలుగు రోజుల్లో దిమ్మను పునర్నిర్మాణం చేస్తామని చెప్పినా నేటి వరకు పనులు చేపట్టలేదన్నారు. వెంటనే స్పందించకుంటే ఆందోళన చేయడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు.

ABN ఆంధ్రజ్యోతి

## వారపు సంతలో వాహన తనిఖీలు

**ముంచంగిపుట్టు, ఏప్రిల్ 1:** స్థానిక వారపు సంతలో శనివారం ఎస్ఐ రవేంద్ర ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సంత పరిసరాల్లో గస్తీ నిర్వహించారు. మారుమూల గ్రామాల నుంచి సంతకు వచ్చిన, తిరుగు ప్రయాణమైన వాహనాలను తనిఖీలు చేశారు. వాహన చోదకులు, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు.

Date: 02/04/2023, Edition: ALLURI SEETHARAMARAJU(ALLURI SEETHARAMARAJU DISTRICT), Page: 8
Source : https://epaper.andhrajyothy.com

ఈనాడు
epaper.eenadu.net

# మద్యం సీసాతో విద్యార్థిపై దాడి

**రావికమతం, న్యూస్‌టుడే:** గర్నికంలో తొమ్మిదో తరగతి విద్యార్థి వానపల్లి శరత్‌పై అదే గ్రామానికి చెందిన వైకాపా కార్యకర్త నవర శ్రీనివాసరావు పగిలిన సీసాతో దాడి చేసి గాయపరిచాడు. గర్నికంకు చెందిన వడ్రంగి వృత్తిదారుడు వానపల్లి శ్రీనివాస్, శ్రీలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు పవన్, శరత్. మేడివాడ జడ్పీ హైస్కూల్లో శరత్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో శరత్ స్నేహితులతో కలిసి సంపద కేంద్రం ప్రాంతానికి షికారుకు వెళ్లారు. ఆ సమయంలో అక్కడ శ్రీనివాసరావుతో పాటుగా మరో ముగ్గురు ఉన్నారు. మద్యం మత్తులో ఉన్న శ్రీనివాసరావు గతంలో కుటుంబ కక్షల నేపథ్యంలో బీరు సీసాను పగలగొట్టి దాంతో శరత్ మెడ భాగంలో పొడవడంతో తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే రావికమతం పీహెచ్‌సీకి, ఇక్కడి నుంచి నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి పంపించారు. గాయం తీవ్రత ఎక్కువగా ఉండటంతో అక్కడి నుంచి విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై బాధితుడి అన్న పవన్ ఆదే రోజు రాత్రి రావికమతం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన జరిగి రెండు రోజులయినా పోలీసులు కేసు నమోదు చేయలేదని, దాడికి పాల్పడింది వైకాపా నాయకుడు కావడంతో ఆపార్టీ నాయకుల ఒత్తిడి మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, బాధ్యుడ్ని ఆరెస్టు చేయకుండా తాత్సారం చేయడంపై బాధితుడి బంధువులు 100 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించారు. కేసు నమోదులో జాప్యంపై విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా యూనియన్ కోశాధికారి పొంపోలు ఆచారి, ఆసంఘం నాయకులు నవర శ్రీను తదితరులు కొత్తకోట సి.ఐ. దృష్టికి తీసు కెళ్లినట్లు శనివారం విలేకర్లకు తెలిపారు. దాడి ఘటనపై ఫిర్యాదు అందిందని, శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమామహేశ్వరరావు చెప్పారు.


శరత్ మెడపై గాయం

Date : 02/04/2023 EditionName : ANDHRA PRADESH( ANAKAPALLI )
PageNo :

ఈనాడు
epaper.eenadu.net

## బైకుల చోరీ.. ముగ్గురి అరెస్టు

**అనకాపల్లి పట్టణం:** బైక్ రేస్‌లో పాల్గొనేందుకు ఖరీదైన వాహనాల చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. క్రైం ఎస్సై సింహాచలం కథనం ప్రకారం.. కాకినాడ గాంధీనగర్‌కు చెందిన సురేంద్ర, మణికంఠ, మరో ఇంటర్ విద్యార్థి బైక్ రేస్‌కి అలవాటు పడ్డారు. ఫిబ్రవరి 28న, మార్చి 27న అనకాపల్లిలో రెండు ద్విచక్ర వాహనాలను చోరీ చేశారు. శనివారం ఉదయం మరో వాహనాన్ని చోరీ చేసి వెళ్తుండగా కొత్తూరు వద్ద పట్టుకున్నారు. మూడు బైకులను స్వాధీనం చేసుకున్నారు.

ఈనాడు
epaper.eenadu.net

## అందరూ చూస్తుండగానే లారీ టైర్ల అపహరణ

**అచ్యుతాపురం, న్యూస్‌టుడే:** రోడ్డు పక్కన లారీ నిలుపగా దాని టైర్లను సినీఫక్కీలో చోరీ చేసిన ఘటన అచ్యుతాపురం మండలం గొర్లెధర్మవరంలో చోటుచేసుకుంది. అచ్యుతాపురం - ఎలమంచిలి రోడ్డులోని గొర్లెధర్మవరం గ్రామానికి చెందిన రాయి శ్రీనివాసరావు తన లారీని ఎప్పటిలాగే రహదారి పక్కన నిలిపారు. స్థానికులు రాకపోకలు సాగిస్తుండగానే దొంగలు లారీకి ఉన్న నాలుగు టైర్లను ఊడదీసి ఎంచక్కా ఆటోలో తీసుకువెళ్లారు. లారీ టైర్లు ఊడదీస్తుండగా చూసిన వారంతా యజమాని శ్రీనివాసరావే టైర్లు మార్చిస్తున్నారనుకుని అక్కడ్నుంచి వెళ్లిపోయారు. లారీ టైర్లు మాయం కావడంతో శ్రీనివాసరావు శనివారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


గొర్లెధర్మవరం వద్ద టైర్లు అపహరణకు గురైన లారీ

Date : 02/04/2023 EditionName : ANDHRA PRADESH( ANAKAPALLI )
PageNo :

# ప్రధాని మోదీకి వ్యతిరేకంగా వామపక్షాల నిరసన



నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు

అనకాపల్లిటౌన్ : ఆదానీ ఆర్థిక కుంభకోణంపై పార్లమెంట్ సమావేశంలో గళం ఎత్తినందుకే రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయడం ప్రధాని మోదీకి తగదని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఐఆర్.గంగాధర్ అన్నారు. స్థానిక నెహ్రూచౌక్‌కు ప్రధాని మోదీకి వ్యతిరేకంగా వామపక్షాలు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ నియంత పాలనకు వ్యతిరేకంగా దేశంలో లౌకికశక్తులు ఏకమవతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నేతలు పి.ఎస్.అజయ్‌కుమార్, బాలకృష్ణ, కొణతాల హరనాథబాబు, కాంగ్రెస్‌పార్టీ నేతలు పాల్గొన్నారు.

Date: 02/04/2023, Edition: Anakapalle(Anakapalle District), Page: 11
Source : https://epaper.sakshi.com/

epaper.eenadu.net

## భూ వివాదంలో మహిళకు గాయాలు

గొలుగొండ, న్యూస్‌టుడే: పాకలపాడులో జరిగిన భూ వివాదంలో మూకల సూర్యనారాయణమ్మపై ఇదే గ్రామానికి చెందిన ఎ.వెంకటరమణ దాడి చేసి గాయపర్చినట్లు కుటుంబ సభ్యుల ఆరోపించారు. గాయపడిన ఆమెను నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఫిర్యాదును పరిశీలించి చర్యలు తీసుకుంటామని గొలుగొండ పోలీసులు వెల్లడించారు.

## రెండు ద్విచక్ర వాహనాల చోరీ

కె.కోటపాడు, న్యూస్‌టుడే: చౌడువాడలో శుక్రవారం రాత్రి రెండు బుల్లెట్ వాహనాలు చోరీకి గురయ్యాయని శనివారం వీటి యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

Date : 02/04/2023
EditionName : ANDHRA PRADESH( ANAKAPALLI )
PageNo :

## అక్రమ తవ్వకాలు ఆపాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని వెదురువాడ కొండపై గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారని వెదురువాడకు చెందిన కొయ్య శ్రీనివాసరావు ప్రకటన విడుదల చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు రంగంలోకి దిగి అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

Date: 02/04/2023, Edition: Anakapalle (Payakaraopeta), Page: 11
Source : https://epaper.sakshi.com/

సాక్షి

# కూలీ రేట్లు పెంచాలి

- బవులువాడలో క్వారీ, క్రషర్ కార్మికుల ఆందోళన



కూలీ రేట్లు పెంచాలంటూ ఆందోళన చేస్తున్న క్వారీ, క్రషర్ కార్మికులు

**అనకాపల్లి రూరల్:** పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా తమ కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ అనకాపల్లి జిల్లకు చెందిన క్వారీ,క్రషర్ కార్మికులు శనివారం ఆందోళన చేపట్టారు. మండలంలోని బవులువాడ డ్రిల్లర్స్ కాలనీలో ఈ మేరకు నిర్వహించిన కూలీల సమావేశంలో తీర్మానించారు. ఏఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో 11వ వేతన ఒప్పందం ప్రకారం యాజమాన్యాలు చర్చలకు రావాలని లేని పక్షంలో భవిష్యత్తులో తమ పోరాటాన్ని మరింత ఉధృతంగా చేపడతామని కూలీలు హెచ్చరించారు. ఇప్పటికే 10వ వేతన ఒప్పందం గడువు ముగిసి నెల రోజులైందని నోటీసులిచ్చినా యాజమాన్యాలు స్పందించక పోవడం దారుణమని ఏఐఎఫ్టీయూ జిల్లా నేత కోన మోహనరావు ఆరోపించారు. శానాపతి సూర్యారావు, దాడి జగ్గారావు, అప్పలనాయుడు, సుభాష్, రమేష్, పుల్లేటి శ్రీను పాల్గొన్నారు.

Date: 02/04/2023, Edition: Anakapalle(Anakapalle District), Page: 11

సాక్షి

# ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ నిరసన



స్టీల్ ప్లాంట్ ఉద్యమానికి మద్దతుగా నాలుగు రోడ్ల కూడలి వద్ద నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నేతలు

**అనకాపల్లి రూరల్:** కేంద్ర ప్రభుత్వ విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యోగ, కార్మిక,ప్రజా సంఘాలు చేపడుతున్న ఉద్యమం 700 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద సీఐటియూ, ఏఐటియూసీ నేతలు నిరసన తెలిపారు. ఉక్కు కర్మాగరం ప్రైవేటీకరణను నిరసిస్తూ చేపడుతున్న ఉద్యమం ఉవ్వెత్తున ఎగసి పడుతుందని, కార్మికుల ఆగ్రహానికి కేంద్ర పెద్దలు గద్దె దిగక తప్పదని ఏఐటియూసీ రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ హెచ్చరించారు. కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. వంట గ్యాస్, డీజిల్, పెట్రో ధరలు విపరీతంగా పెంచుకుంటూ పోవడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులకు అందుబాటులో లేనంతగా పెరిగిపోతున్నాయని అన్నారు. సీఐటీయూ జిల్లా నేత కోటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు శ్రీ రామదాసు, అబ్బులు, భద్రం, తదితరులు పాల్గొన్నారు.

Date: 02/04/2023, Edition: Anakapalle(Anakapalle District), Page: 11
Source : https://epaper.sakshi.com/

సాక్షి

# 5న జగ్జీవన్‌రాం, అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ



గుర్రం జాషువా కాలనీలో విగ్రహాల ఏర్పాటుపై కరపత్రాలతో ప్రచారం

కశింకోట: కశింకోటలోని గుర్రం జాషువా కాలనీలో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఈ నెల 5న నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కట్టుమూరి మంగరాజు తెలిపారు. విగ్రహాల నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఈ మేరకు కర పత్రాలు పంపిణీ చేసి శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 116వ జయంతి పురస్కరించుకొని ఆయనతో పాటు డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామని, వీటిని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆవిష్కరించనున్నారని చెప్పారు. ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కట్టుమూర్తి సతీష్, తదితరులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. కర పత్రాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా దళిత బహుజన ఆదరణ సేవా సమితి అధ్యక్షుడు కొల్లి చిన అప్పారావు, విగ్రహాల నిర్మాణ కమిటీ ప్రతినిధులు కొల్లి రామంజీ, వైరల అప్పారావు, చెవ్వేటి నాగరాజు, చెవ్వేటి ప్రకాష్, కొల్లి రమణ పాల్గొన్నారు.

Date: 02/04/2023, Edition: Anakapalle(Anakapalle District), Page: 11
Source : https://epaper.sakshi.com/

సాక్షి

# కూలీలకు గిట్టుబాటు వేతనం కల్పించాలి



ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీవో

నక్కపల్లి : ఉపాధి హామీ పథకంలో కూలీలందరికీ గిట్టుబాటు వేతనం లభించే విధంగా పనులు కల్పించాలని ఎంపీడీవో సీతారామరాజు ఆదేశించారు. శనివారం ఆయన ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ఉపాధి కూలీలకు వేసవి అలవెన్సు మంజూరు చేసిందన్నారు. రోజుకు రూ.270 గిట్టుబాటు అయ్యే విధంగా చర్యలు చేపట్టిందన్నారు. సోమవారం నుంచి జాబ్‌కార్డు కలిగిన కూలీలంతా పనులకు హాజరయ్యే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలన్నారు. మస్తరు విషయంలో అక్రమాలు జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీవో ఈశ్వరరావు పాల్గొన్నారు.

Date: 02/04/2023, Edition: Anakapalle(Payakaraopeta), Page: 11
Source : https://epaper.sakshi.com/

ఈనాడు
epaper.eenadu.net

# ఇసుక తవ్వకాల నియంత్రణకు చెక్‌పోస్టు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: పెనుగొల్లు శివారు సోముదేవుపల్లి వద్ద వరహా నదిలో ఇసుక తవ్వకాల నియంత్రణకు చెక్‌పోస్టు ఏర్పాటు చేస్తామని ఇన్‌ఛార్జి తహసీల్దార్ శ్యామ్ పేర్కొన్నారు. వరహా నది గట్టున నిల్వ చేసిన ఇసుక బస్తాలను వీఆర్వో అప్పారావు, వీఆర్ఏలు, పోలీస్ సిబ్బంది శనివారం తొలగించారు. నదిలో ఇసుక తవ్వకాల నియంత్రణకు 24 గంటలపాటు నిఘా ఉండేలా చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలని ఎస్సై ప్రసాదరావుకు సూచించారు.



ఇసుక బస్తాలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

Date : 02/04/2023 EditionName : ANDHRA PRADESH( ANAKAPALLI )
PageNo :

సాక్షి

# చలో ఢిల్లీ విజయవంతం చేయాలి

రాంబిల్లి: కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని సీఐటీయూ మండల కార్యదర్శి జి. దేముడు నాయుడు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 5న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ మేరకు రాంబిల్లిలో శనివారం ఆయన గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్మిక నాయకులు రామకృష్ణ, రాంబాబు పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న దేముడునాయుడు

**అచ్యుతాపురం(అనకాపల్లి):** ఈ నెల 5న నిర్వహించే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు రాము పిలుపునిచ్చారు. కార్మిక, కర్షకులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని ఆయన తెలిపారు. ఈ క్రమంలో శనివారం తిమ్మరాజుపేట, కొండకర్ల, అచ్యుతాపురం, దోసూరు గ్రామాల్లో పర్యటించి భవన నిర్మాణ కార్మికులతో సమావేశమయ్యారు. లేబర్ కోడ్‌లో తీసుకొచ్చిన మార్పులను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. శ్రీను, తాతారావు, రాజు, రమేష్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

Date: 02/04/2023, Edition: Anakapalle(Payakaraopeta), Page: 11
Source : https://epaper.sakshi.com/

ఈనాడు
epaper.eenadu.net

## రోడ్డు పునర్నిర్మాణం కోరుతూ సంతకాల సేకరణ

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురం - అనకాపల్లి రోడ్డును పునర్నిర్మించాలని కోరుతూ తిమ్మరాజుపేటకు చెందిన ఆడారి రామకృష్ణ శనివారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ ప్రతులను ముఖ్యమంత్రి, గవర్నర్‌కు పోస్టులో పంపనున్నట్లు ఆయన చెప్పారు.



సంతకాలు చేస్తున్న విద్యార్థులు

Date : 02/04/2023 EditionName : ANDHRA PRADESH( ANAKAPALLI ) PageNo :

ఈనాడు
epaper.eenadu.net

## రాహుల్‌గాంధీ సభ్యత్వం రద్దుపై నిరసన

నెహ్రూచౌక్ (అనకాపల్లి), పాయకరావుపేట: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీపై కక్షపూరితంగానే కేంద్ర ప్రభుత్వం ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేసిందని ఆ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేషన్ సభ్యుడు ఐఆర్ గంగాధర్ పేర్కొన్నారు. నెహ్రూచౌక్ కూడలిలో వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. పేటలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట కాంగ్రెస్ నాయకులు బుర్తి ఏసు సత్యనారాయణ, అప్పారావు, శివ, రమణ ప్లకార్డులతో నిరసన చేపట్టారు.

Date : 02/04/2023 EditionName : ANDHRA PRADESH( ANAKAPALLI ) PageNo :

ఆంధ్రప్రభ

# ఖాకీల జనరల్ దందా



విశాఖ క్రైం,అనకాపల్లి (ప్రభ న్యూస్): ఇక్కడ కేసులు కంటే కాసులు పైనే మమకారం ఎక్కువ. ఎక్కడికక్కడ అడ్డుగోలు దందా చేస్తూ అక్రమార్జనతో ఆస్తులను కూడ గడుతున్నారు. అటు రాజకీయ నాయకుల అండదండలు ఉండటంతో మరింత రెచ్చిపోతూ ఇష్టానుసారంగా వ్యవహారిస్తున్నారు. ప్రస్తుతం అనకాపల్లి జిల్లాలో పోలీసుల తీరు విమర్శలకు తావిస్తుంది. పెండింగ్ కేసుల విషయంలో బొరవ చూపకుండా అక్రమార్జనపై దృష్టి సారించి రెండు చేతుల సంపాదిస్తున్నారు. దీంతో ఇక్కడ పోలీసు అధికారులపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ఆరోపణ ఎదుర్కొంటున్న అధికారులపై ఉన్నత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారు. అనకాపల్లి జిల్లా ఎక్కడ చూసినా పోలీసుల అవినీతి బహటంగా కనిపిస్తుందనిపలువురు ఆరోపిస్తున్నారు. యూనిఫామ్ లేకుండా మఫ్టీ లో వసూళ్ళకుపాల్పడుతున్నారనిజిధ్వజమెత్తుతున్నారు. జిల్లాలోఅన్ని చోట్లా భారీగా నెలవారీ మామూళ్లుచేస్తూ పెద్ద మొత్తంలో అక్రమ ఆస్తులు కూడగడుతున్నారని ఆరోపిస్తున్నారుజిల్లా పరిధిలో గలపరవాడలోని ఓ జనరల్ కానిస్టేబుల్ వ్యవహారం అక్కడ పోలీసుల తీరును ఎండ గడుతుంది. ఇక్కడ పని చేసే ఒక కానిస్టేబుల్ షాడో సిఐ గా చలామణీ అవుతూ అక్రమ దందాలకు తెర లేపుతున్నాడు. ఇందులో ఎస్సై, సీఐలను కూడా ఇన్వాల్వ్ చేస్తూ వారి పేరు చెప్పి మరిపెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నాడు. ఒక పరవాడ మాత్రమే కాదు అనకాపల్లి జిల్లా పరిధిలో ఉన్న సుమారుగా అన్ని పోలీస్ స్టేషన్లలో 41 ఏ కేసుల బెయిల్ దగ్గర నుండి సివిల్ కేసుల వరకు బాదుడే బాదుడు. కేసుల పై సాధించడం పూర్తిగా మానేశారు. ఇప్పుడు తమ దృష్టి కాసులపైనే ఉండటంతో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. అనకాపల్లి పోలీసులకు కేసులు పరిష్కారంలో శ్రద్ధ కనబరచకుండా కాసులొచ్చే దందాలకు మాత్రమే ముందుంటున్నారు. అటువంటి వ్యవహారాల పైనమరింతగా మమకారం చూపెడుతున్నారు. అనకాపల్లి జిల్లా పరిధిలో ఉన్నఫార్మా కంపెనీలు అన్ని కొందరు అవినీతి పోలీసు అధికారులు గుప్పెట్లో ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. పలు వ్యాపార సంస్థలను కూడా బెదిరించి వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో నెలవారి వసూళు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. విధులలో ఉన్న లేకపోయినా అక్రమ వసూలు చేయడంలో మాత్రం ఎప్పుడూ ముందు ఉంటున్నారుమఫ్టీ లో ఉంటూ దర్జాగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇటుకబార్ల నుండి దాబాలు వరకు నెలవారీ వసూళ్ల షరా మామూలే. అనకాపల్లి ఉన్నతాధికారుల నిఘా లేకపోవడంతోనే కొందరు పోలీసు అధికారులు ఇటువంటి వ్యవహారాలకు పాల్పడుతున్నారు. జిల్లా పరిధిలో ఉన్న పలు పోలీస్ స్టేషన్లలో ఇప్పటి వరకు చిక్కుముడి వీడని హత్య కేసులు ఎన్నో ఉన్నప్పటికీ వాటిపై ఏ మాత్రం దృష్టి సారించకుండాఆదాయం వచ్చే కేసులు పైనే పనిచేస్తున్నారు. వసూళ్ల పై ఉన్న శ్రద్ధ కేసుల పనితీరు పై లేదంటూ స్థానికంగా విమర్శలు వస్తున్న సరే అవేమీ పట్టించుకోవడం లేదు. కొత్త జిల్లా పోలీసులు పనితీరు పై స్పందించే నాథుడే లేకుండా పోయాడు. పోలీసుల అక్రమ దందా స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి వెళ్ళినప్పటికీవారు కూడా ప్రేక్షక పాత్ర వహించడం తప్ప ఏమి చేయలేని పరిస్థితి ఉంది. ఎందుకంటే ఇక్కడ కూడా పోలీసు శాఖలో రాజకీయ జోక్యం ఉండటంతోఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతుంది. ఒక విధంగా చెప్పాలంటే వారిపై చర్యలు తీసుకోవడానికి కూడా సహకరించడం లేదు. ఇక్కడ పని చేస్తున్న కొందరు పోలీసు అధికారులకు స్థానిక అధికార పార్టీ నాయకులు తో పాటు రాష్ట్ర పార్టీ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండటంతో తమ ఎవరు ఏమి చేయలేరనే ధైర్యంతోఅడ్డమైన పనులు చేస్తున్నారు. అక్రమార్జన కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. జిల్లా ఏర్పడినప్పటి నుంచి కూడా ఇక్కడ పోలీసుల పై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. సంబంధిత అధికారులకు వీరిపై ఫిర్యాదులు కూడా వెళు న్నాయి. అయినప్పటికీ కూడా సదర అధికారుల పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ కారణంతోనే అడ్డదారి తొక్కుతున్న కొందరు అధికారులుఅదే అవకాశం గా భావించి ఎక్కడికక్కడ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇటువంటి అధికారులపై ఏసీబీ అధికారులు కచ్చితంగా నిఘా పెట్టాలని, వారి పై ఆకస్మిక తనిఖీలు చేపట్టి పట్టుకోవాలని, వారి పై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

Date: 02/04/2023, Edition: Visakhapatnam, Page: 8
Source : https://epaper.prabhanews.com/

ఆంధ్రప్రభ



## ఖాకీల జనరల్ దందా!

అనకాపల్లి జిల్లాలో మఫ్టీ పోలీసుల బరితెగింపు!

» కేసుల పేరుతో కాసులు వసూళ్లు » ప్రతి స్టేషన్ కు మఫ్టీ లో జనరల్ కానిస్టేబుల్ హవా! » పరవాడ జనరల్ కానిస్టేబుల్ పై అవినీతి ఆరోపణలు! » ఎక్కడికక్కడ అడ్డగోలు దందా » రోడ్డు ప్రమాదాలు, స్టేషన్ బెయిల్ లో కనకవర్షం » క్రైమ్ రేట్ పెరుగుతున్న పట్టించుకోని అధికారులు » అనకాపల్లి పోలీసులు పై నిఘా ఎక్కడ!

4

ఈనాడు
epaper.eenadu.net

# అధ్యాపకుల అనుచిత ప్రవర్తనపై సమగ్ర విచారణ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: రేబాకలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈసీఈ విభాగానికి చెందిన ఇద్దరు అధ్యాపకుల అనుచిత ప్రవర్తనపై శనివారం సమగ్ర విచారణ జరిగింది. అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అధ్యాపకులు వేధింపులకు గురిచేస్తున్నారంటూ కొంతమంది విద్యార్థులు 'ఈనాడు'కు లేఖ రాసిన నేపథ్యంలో శనివారం పత్రికలో వార్త ప్రచురితమైంది. స్పందించిన కళాశాల ప్రిన్సిపల్ బీవీఎస్ఎస్ శ్రీనివాసరావు, ఈసీఈ విభాగం హెచ్ఓడీ వెంకటేశ్వరరావు వెంటనే విచారణ చేపట్టారు. ఈసీఈ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు తెల్లకాగితాలు ఇచ్చి పేరు, వివరాలు లేకుండా అధ్యాపకుల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులు రాయాలని సూచించారు. సుమారు 40 మంది విద్యార్థులు ప్రాక్టికల్స్ మార్కులు వేయడంలో అధ్యాపకులు వివక్ష చూపుతున్నారని రాసినట్లు సమాచారం. ఈసీఈ మూడో సంవత్సర విద్యార్థులు విశాఖపట్నంలో జరుగుతున్న ప్రాంగణ నియామకాలకు వెళ్లారని, వారి నుంచీ సమాచారం తీసుకుంటామని ప్రిన్సిపల్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. అసంతరం అధ్యాపకులపై తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రాక్టికల్స్ మార్కులు అధ్యాపకుల పరిధిలో కాకుండా హెచ్ఓడీ పరిధిలో ఉండేలా చూస్తామన్నారు. అధ్యాపకులపై వచ్చిన ఫిర్యాదులపై కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

Date : 02/04/2023 EditionName : ANDHRA PRADESH ( ANAKAPALLI ) PageNo :

సాక్షి

# మహిళా పోలీస్ రమాదేవికి అవార్డు



రమాదేవికి సర్టిఫికెట్ అందజేస్తున్న సీపీ శ్రీకాంత్

**సింహాచలం:** పెందుర్తి మండలం చింతగట్ల పంచాయతీ గ్రామ సచివాలయంలో మహిళా పోలీస్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఒల్లి రమాదేవి పనితీరుకు గుర్తింపు లభించింది. ఈమె సీపీ సీహెచ్ శ్రీకాంత్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. లోన్ యాప్స్‌తో పాటు వుమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, సైబర్ నేరాలు, దిశ యాప్‌పై మహిళలకు అవగాహన కల్పించడంతో ఈ అవార్డు లభించింది.

Date: 02/04/2023, Edition: Visakhapatnam (Pendurthi), Page: 11
Source : https://epaper.sakshi.com/

సాక్షి

- గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ స్పష్టీకరణ
- బీజేపీ కార్యదర్శి సత్యకుమార్ కారుపై ఎవరూ రాయి విసరలేదు
- కాన్వాయ్‌లోని చివరి కారుపై రాయి విసిరిన వ్యక్తి అరెస్ట్



# అనుచిత వ్యాఖ్యలు చేస్తే చర్యలు తప్పవు

నగరంపాలెం : అమర్యాద ప్రవర్తన, అనుచిత వ్యాఖ్యలతో రెచ్చగొట్టే వారిపై చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ స్పష్టం చేశారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు వైరల్ కావడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొందన్నారు. మూడు రాజధానుల శిబిరం వద్ద ఇరువర్గాల మధ్య తోపులాటను అక్కడే విధుల్లో ఉన్న ఏఎస్పీ అనీల్‌కుమార్, తుల్లూరు డీఎస్పీ పోతురాజు, పోలీసులు సత్వరమే స్పందించి నిలువరించారని చెప్పారు. బీజేపీ కార్యదర్శి సత్యకుమార్ కాన్వాయ్ విజయవాడ వైపు బయలుదేరగా, చివరి కారుపై ఓ వ్యక్తి రాయి విసిరారని తెలిపారు. సత్యకుమార్ ప్రయాణిస్తున్న కారుపై రాయి వేయలేదని స్పష్టంచేశారు. సురేష్ అనే వ్యక్తి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, సత్వరమే సీసీ ఫుటేజ్ ఇతర ఆధారాల మేరకు తాళ్లాయపాలెం గ్రామానికి చెందిన డి.నితిన్‌ను అరెస్ట్ చేశామన్నారు.

Date: 02/04/2023, Edition: Visakhapatnam(Visakhapatnam Main), Page: 4
Source : https://epaper.sakshi.com/

epaper.eenadu.net

## రాష్ట్రంలో పోలీసుస్వామ్యం

### వైకాపా ఎంపీ రఘురామకృష్ణరాజు

ఈనాడు, దిల్లీ: రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని, పోలీసుస్వామ్యం మాత్రమే నడుస్తోందని వైకాపా ఎంపీ రఘురామకృష్ణరాజు అన్నారు. దిల్లీలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భాజపా జాతీయ కార్యదర్శి సత్య కుమార్‌పై దాడి చేయాలనేది స్థానిక నేతలు తీసుకున్న నిర్ణయం కాదని, ముఖ్యమంత్రి లేదా ఉన్నత పదవిలో వారెవరో ఈ నిర్ణయం తీసుకొని ఉండాలన్నారు. ఈ ఘటనలో ఆదినారాయణరెడ్డి కంటపడి ఉంటే చంపి వేసి ఉండేవారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. సత్యకుమార్‌పై దాడి ఘటనను జీరో అవర్‌లో ప్రస్తావిస్తానని తెలిపారు. వాస్తవాలను వెలుగులోకి తీసుకు వస్తున్న 'ఈనాడు' పై రాష్ట్ర ప్రభుత్వం ఎదురు దాడి చేస్తోందని ఎంపీ రఘురామ మండిపడ్డారు. మార్గదర్శి కంపెనీల ఆడిటర్‌కు నోటీసు ఇచ్చి కేవలం సమాచారం తెలుసుకుంటామని పిలిపించి కస్టడీలోకి తీసుకొని చిత్రహింసలకు గురిచేశారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ఆడిటర్లు ఈ విషయంపై స్పందించి కేంద్ర ప్రభుత్వం విచారణ జరిపించాలని కోరాలన్నారు. ఇతరులను మానసికంగా వేధించడమే మన రాజకీయమా అని ముఖ్యమంత్రిని రఘురామ ప్రశ్నించారు.

Date : 02/04/2023
EditionName : ANDHRA PRADESH( VISAKHAPATNAM )
PageNo :

epaper.eenadu.net

## సురేశ్ రైనా అత్తామామల హత్యకేసు నిందితుడి ఎన్‌కౌంటర్

ముజఫర్‌నగర్: మాజీ క్రికెటర్ సురేశ్ రైనా కుటుంబీకుల హత్య కేసులో నిందితుడిని పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. ఈ ఘటన ఉత్తర్‌ప్రదేశ్.. ముజఫర్‌నగర్‌లోని షాపుర్‌లో శనివారం జరిగింది. 2020 ఆగస్టు 19న పఠాన్‌కోట్‌లోని క్రికెటర్ సురేశ్ రైనా అత్త, మామ ఇంట్లో రషీద్ చోరీకి పాల్పడ్డాడు. నిందితులను అడ్డుకునేందుకు ప్రయత్నించిన సురేశ్ రైనా మామ అశోక్ కుమార్, అత్త ఆశా, బావమరిది కౌశల్ కుమార్‌లను రషీద్ తీవ్రంగా గాయపరిచాడు. అశోక్ అక్కడికక్కడే మృతి చెందగా.. ఆశా, కౌశల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను గతేడాది సెప్టెంబరులో పోలీసులు పట్టుకున్నారు. వారిని విచారించగా రషీద్ పేరు బయటకొచ్చింది. అప్పటికే రషీద్ పరారీలో ఉన్నాడు. 'శనివారం కొందరు నేరస్థులు షాపుర్‌కు వచ్చినట్లు ఇన్‌ఫార్మర్ నుంచి మాకు సమాచారం అందింది. దీంతో పోలీసులు, ఎస్‌వోజీ బృందం అప్రమత్తమైంది. సోరం-గోయ్లా రహదారిపై దుండగులు పోలీసులపై కాల్పులు జరిపారు. పోలీసులు ఆత్మరక్షణ కోసం కాల్పులు జరపగా నిందితుడు రషీద్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే షాపుర్‌లోని సీహెచ్‌సీకి తరలించాం. అప్పటికే నిందితుడు మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు" అని పోలీసులు తెలిపారు.

Date : 02/04/2023 EditionName : ANDHRA PRADESH ( VISAKHAPATNAM ) PageNo :

ఈనాడు
epaper.eenadu.net

# నిరసన తెలపడానికే రాయి విసిరారు..

- సత్యకుమార్‌పై దాడి ఘటనలో ఇరువర్గాలపై కేసులు
- నిఘా విభాగం సమాచారం మేరకే బందోబస్తు ఏర్పాట్లు
- గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ వెల్లడి

ఈనాడు, అమరావతి-గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: భాజపా నేత సత్యకుమార్ కాన్వాయ్‌పై శుక్రవారం గుంటూరు జిల్లా తుళ్లూరు సమీపంలో జరిగిన దాడి సంఘటనకు సంబంధించి రెండు కేసులు నమోదు చేశామని జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. అమరావతి రైతులకు సంఘీభావం తెలిపి వెళుతున్న సత్యకుమార్, ఇతర నేతలు.. మూడు రాజధానులకు మద్దతుగా ఏర్పాటుచేసిన శిబిరం వద్దకు చేరుకునేసరికి దాడి చోటుచేసుకున్న విషయం తెలిసిందే. భాజపా వారి కాన్వాయ్‌పై రాయితో దాడి చేసిన నితిన్‌ను అరెస్టు చేశామని ఎస్పీ తెలిపారు. సత్యకుమార్‌పై దాడి చేయాలనే ఉద్దేశంతో కాకుండా నిరసన తెలపాలని అతడు రాయి విసిరాడని తెలిపారు. రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడంతో మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డిపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. సీఎంను దూషించిన కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఆయనపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఏఎస్పీ అనిల్ మాట్లాడారు. ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యలు వైరల్ కావడంతో మూడు రాజధానుల శిబిరం వద్ద ఉత్కంఠ నెలకొన్నట్లు సమాచారం వచ్చిందని.. తాను, డీఎస్పీ పోతురాజు, పోలీసులు అక్కడికి చేరుకున్నామని తెలిపారు. అప్పటికే అక్కడికి వస్తున్న భాజపావారి వాహనాల ఎదురుగా రోడ్డుపైకి వచ్చి మూడు రాజధానుల శిబిరంలోని వారు బైఠాయించారని తెలిపారు. అప్పుడు జైఅమరావతి అన్న నినాదాలు వినిపించడంతో మూడు రాజధానుల వారు స్పందించారని, దీంతో తోపులాట చోటుచేసుకుందని వివరించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు రక్షణతో భాజపా నాయకులున్న కాన్వాయ్‌ను పంపించామన్నారు. ఇంతలో గుర్తుతెలియని వ్యక్తి కాన్వాయ్‌లోని చివరి వాహనంపై రాయి విసిరారని, ఆయన్ను నితిన్‌గా గుర్తించామని తెలిపారు. దాడికి గురయిన కారులో సత్యకుమార్ లేరని వివరించారు. కాన్వాయ్‌లో భాజపా నేత సత్యకుమార్ ఉన్నట్లు తమకు తెలియదని అన్నారు. ఈ సందర్భంగా విలేకరుల ప్రశ్నలకు పోలీసు ఉన్నతాధికారులు సమాధానమిచ్చారు. భాజపా కార్యకర్త, చొక్కా చిరిగిన సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్పీ తెలిపారు. బాపట్ల ఎంపీపై ఫిర్యాదు చేయలేదని, వైకాపా వాళ్లని పేర్కొన్నారని తెలిపారు. వైకాపాతో సంబంధం లేకుండా సంఘటనలో ఎంతమంది పాత్ర ఉంటే అందరిపైనా చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు. ఈ దాడికి జగన్ పథక రచనతో పాటు పోలీసుల సహకారమూ ఉందన్న సత్యకుమార్ ఆరోపణలపై ఏఎస్పీ స్పందించారు. పోలీసులెలా సంరక్షించి కాన్వాయ్‌లో పంపించారనేది అన్ని మీడియాల్లో చూశారని వెల్లడించారు. దాడి చేయాలని మూడు రాజధానుల శిబిరం వారు పథకం రూపొందించుకున్నారా? అని ప్రశ్నించగా.. ఇది విచారణలో తేలుతుందని, తమ ఆలోచన హైకోర్టుకు వెళ్లే మార్గంలో ఎలాంటి సంఘటనలు జరగకూడదేనని వెల్లడించారు. ముందుగానే మూడు రాజదానుల శిబిరంలోని వారిని పంపించేస్తే ఈ సంఘటన జరిగేది కాదు కదా? అన్న విలేకరుల ప్రశ్నకు డీఎస్పీ పోతురాజు సమాధానమిచ్చారు. 'భాజపావాళ్లు ముందు మందడం శిబిరానికి వెళ్లారు. అక్కడినుంచి తుళ్లూరు మీదుగా ఆదినారాయణరెడ్డితో పాటు ఇతరుల వాహనాలు వెళ్లిపోయాయి. తుళ్లూరులో భాజపా కార్యకర్తను పరామర్శించడానికి సత్యకుమార్ వెళ్లి అక్కడినుంచి విజయవాడ వెళ్లటానికి రివర్స్‌లో సీడ్‌యాక్సెస్ రోడ్డు వైపు వచ్చారు. కాన్వాయ్ వెనక్కురావడంతో మా సిబ్బందినుంచి సమాచారం రాగానే వెళ్లేప్పటికి ఈ సంఘటన చోటుచేసుకుంది' అని వివరించారు. భాజపా జాతీయస్థాయి నాయకుల పర్యటన సమయంలో నిఘా విభాగమిచ్చే సమాచారంబట్టే బందోబస్తు ఏర్పాటు చేశామని, కాకపోతే వాళ్లు మార్గం మార్చుకోవడంతో ఇలా జరిగిందని డీఎస్పీ తెలిపారు. ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యలపై మధ్యాహ్నం ఫిర్యాదు రావడంతో తొలుత కేసు నమోదు చేశామని, ఆ తర్వాతి పరిణామాలపై తదనుగుణంగా చర్యలు తీసుకున్నామని డీఎస్పీ వివరించారు. ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యల వీడియోలను మీకు పంపుతానని మరో ప్రశ్నకు సమాధానమిచ్చారు. 'మూడు రాజధానుల శిబిరం మీదుగా మేము వెళ్లేటప్పుడు ఎవరూ లేరు? మళ్లీ అటుగా వస్తున్నామని తెలుసుకొని దాడికి వచ్చారని భాజపావారు ఆరోపిస్తున్నారని ప్రశ్నించగా.. అది వాస్తవం కాదని, సీసీ కెమెరాలున్నాయని.. కావాలంటే ఫుటేజీలు పరిశీలించుకోవచ్చని తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, ఏఎస్పీ అనిల్‌కుమార్, డీఎస్పీ పోతురాజు

Date : 02/04/2023 EditionName : ANDHRA PRADESH( VISAKHAPATNAM ) PageNo :

ఈనాడు
epaper.eenadu.net

# అతిథులపై అకృత్యాలా?

వేల సంవత్సరాలుగా విశిష్ట సంస్కృతీ సంప్రదాయాలకు నెలవైన ఘనత- భరత మాత కంఠసీమలో సహజాభరణం. నైతికత, నాగరికతల కలబోతగా ప్రపంచ దేశాలకు జ్ఞానప్రదాతగా వెలుగులీనిన ధన్యచరిత- ఈ పుణ్యధాత్రి సొంతం. స్త్రీని మాతృస్వరూపంగా, అతిథి అభ్యాగతుల్ని దైవ సమానులుగా సంభావించి సమాదరించిన అద్భుత ఒరవడికి నేడు ఎలాంటి వికృతజాఢ్యం సంక్రమించింది? ఈ గడ్డపై కొన్నేళ్లుగా పైశాచిక శక్తులు, ఆసుర మూకల వీరంగం నిశ్చేష్టపరుస్తోంది. దూరతీరాలనుంచి తరలివచ్చిన సందర్శకుల్ని భద్రంగా సాగనంపే ఉత్తమ సంస్కారానికి తలకొరివి పెట్టే దానవ సంతతి అకృత్యాలు పెచ్చరిల్లుతున్న తీరు- యావజ్జాతినీ తలదించుకునేలా చేస్తోంది!

భారత పర్యటనకు వచ్చిన నెదర్లాండ్స్ మహిళపై ఆమె బసచేసిన గోవా హోటల్ సిబ్బందిలో ఒకడు కన్నేశాడు. ఆమె ఆదమరచి నిద్రిస్తుండగా అర్ధరాత్రి వేళ చొరబడిన నిందితుడు అనుచిత ప్రవర్తనకు తెగబడ్డాడు. భయభ్రాంతులకు గురైన యువతి గట్టిగా కేకలు పెట్టేసరికి ఆమె పీక నొక్కి బెదిరించాడు. అంతలో అరుపులు విని స్థానికుడొకరు కాపాడేందుకు వచ్చేసరికి- ఆ ఇద్దరినీ కత్తితో పొడిచి అక్కడి నుంచి పరారయ్యాడు. అంతకు వారం రోజుల్లోపే గోవా హోటల్ గదిలో విశ్రమిస్తున్న రష్యన్ జాతీయురాలిపై ఇద్దరు వ్యక్తులు దాడికి, దొంగతనానికి యత్నించి అడ్డంగా దొరికిపోయారు. వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు గోవా పేరు అవమానకరంగా పత్రికలకు ఎక్కడంపై తాజాగా స్పందించిన ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్- నెదర్లాండ్స్ యువతిని కాపాడుతూ కత్తిపోట్లకు గురైన వ్యక్తిని సన్మానిస్తామని ప్రకటించారు. మరి, దేశం పరువు ప్రతిష్ఠలకు పడిన తూట్ల మాటేమిటి?

నిరుడు నెల్లూరు జిల్లాలో విదేశీ వనితపై లైంగిక దాడి ఘటన కలకలం రేకెత్తించింది. తాను ఒంటరిగా ఎన్నో దేశాలు పర్యటించినా ఎప్పుడూ ఇటువంటి చేదు అనుభవం ఎదుర్కోలేదన్న లిథువేనియా మహిళ- తనపై దాడిని తప్పించుకుని వాహన చోదకుల సాయంతో పోలీస్ రక్షణ పొందగలిగింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు జరిగిన అత్యాచార యత్నం విదేశీ పర్యాటకులకు దేశంలో పొంచి ఉన్న గండాలెన్నో మప్పుకు చాటింది. ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నది అసత్యం. పర్యాటకుల భద్రతకు దేశవ్యాప్తంగా ప్రత్యేక దాణాలు నెలకొల్పదలచామని కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రివర్యులు ప్రకటించి ఏడాదిన్నర కాలం గతించింది. వెలుపలి సందర్శకులపై ముఖ్యంగా మహిళల మీద దాడులు, వేధింపుల ఉదంతాలు అంతులేని కథగా వెలుగు చూస్తున్న తరుణంలోనైనా భద్రతాపరమైన చర్యలు చురుకందుకోవాలి. లేకపోతే మసిబారిన ప్రతిష్ఠ తేటబారదు.

అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా ప్రభృత దేశాలు- ఇండియాలో పర్యటించే మహిళలు తగుజాగ్రత్తలు తీసుకోవాలంటూ హెచ్చరికలు జారీ చేయాల్సి రావడం ఎవరికి గౌరవం? ఆయా దేశాల 'ప్రత్యేక సూచనలు' భారతదేశ ప్రతిష్ఠకు ఏడు నిలువుల లోతున పాతరేస్తున్నాయి. ఇటీవలి హోలీ పర్వదినాన జపనీస్ మహిళ ఒకరు దిల్లీలో



### పుణ్యభూమి

అనుచిత వేధింపుల పాలబడ్డానంటూ చేసిన వరస ట్వీట్లు గగ్గోలు పుట్టించాయి. సంక్రాంతి వేళ కేరళలోని ఇడుక్కిలో విదేశీ పర్యాటకుల్ని చితకబాదిన 14 మంది అరెస్టయ్యారు. రెండు నెలల క్రితం యూకే యువతిపై తిరువనంతపురంలో అయిదుగురు సభ్యుల ముఠా లైంగిక దాడులకు తెగబడింది. అదే కేరళలోని కోవలం బీచ్ దగ్గరి రిసార్టు నుంచి లాత్వియన్ టూరిస్ట్ అయిదేళ్లక్రితం అదృశ్యమైంది. సుదీర్ఘ విచారణ దరిమిలా ఫోరెన్సిక్ డీఎన్ఏ పరీక్ష తదితరాల ద్వారా అప్పట్లో జరిగిందేమిటో అక్కడి జిల్లా కోర్టు ఇటీవలే సాక్ష్యాధారాల ప్రాతిపదికన ధ్రువీకరణకు వచ్చింది. ఆ యువతిని ఇద్దరు నేరచరితులు మాదకద్రవ్యాల... మత్తులో ముంచి, పలుమార్లు కిరాతకంగా బలాత్కరించి పశువాంఛ తీర్చుకున్నాక సముద్ర జలాల్లో తొక్కిపట్టి ఊపిరాడకుండా చేసి పొట్టన పెట్టుకున్నారని నిర్ధారించింది. వాళ్లిద్దరూ హతమార్చింది విదేశీ సందర్శకురాల్ని మాత్రమే కాదు- 'అతిథి దేవోభవ' సంస్కృతి స్ఫూర్తిని.

అంతర్జాతీయ ప్రయాణాలు పర్యాటక సూచీలో 2019 నాటికి భారత్ 46వ స్థానంలో ఉండేది. ఇప్పుడది 54వ స్థానానికి పతనమైంది. అమెరికా, స్పెయిన్, ఫ్రాన్స్, జర్మనీ, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా, బ్రిటన్, సింగపూర్, ఇటలీ వంటివి సందర్శకుల్ని సూదంటురాయిలా ఆకర్షిస్తున్నాయి. దర్జాగా భారీయెత్తున విదేశీ మారకద్రవ్యాన్ని కూడబెట్టుకుంటున్నాయి. అపార ఉపాధి అవకాశాల పరికల్పనతో ఆతిథ్య రంగాన్ని సుసంపన్నం చేసుకుంటున్నాయి. సాంస్కృతికంగా భౌగోళికంగా తనకున్న ఎన్నో ప్రత్యేకతల్ని సొమ్ము చేసుకోవడంలో విఫలమవుతున్న ఇండియా- చిన్నాచితకా దేశాల సరసనా వెలాతెలాపోతోంది. మలేసియా, ఇండొనేసియా వంటివీ పర్యాటక రంగంలో మనకన్నా మిన్నగా రాణిస్తున్నాయి. పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల పరిపుష్టీకరణ, ఆతిథ్య రంగానికి వివిధ పన్నుల రాయితీలపై ప్రభుత్వాలు తగినంతగా దృష్టి కేంద్రీకరించక- దేశం ఇప్పటికే నష్టపోతోంది. మహిళా పర్యాటకులపై లైంగిక దాడులు, సందర్శకుల పట్ల అమానవీయ ధోరణులు కొనసాగితే... దేశీయ టూరిజం ఇంకా బక్కచిక్కిపోదా?

జాతీయ నేర గణాంకాల సంస్థ క్రోడీకరించిన సమాచారం ప్రకారం, ఏడాది కాలంలో విదేశీ పర్యాటకులకు అత్యంత అభద్రమైన నగరమన్న దుష్కీర్తి దేశ రాజధానికే దఖలుపడింది. నువ్వా నేనా అంటూ దిల్లీకి కర్ణాటక గట్టి పోటీ ఇస్తోంది. 2016-2021 సంవత్సరాల మధ్య దేశం నలుమూలలా విదేశీ పర్యాటకులపై దాష్టీకాలకు సంబంధించి ఏకాయెకి 2136 కేసులు నమోదయ్యాయి. జీ-20 అధ్యక్ష బాధ్యతలు దఖలుపడిన దశలోనైనా అతిథుల భద్రతా ఏర్పాట్లలో పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. అందులో కేంద్రం ఎక్కడా ఏ మాత్రం అలసత్వానికి తావివ్వకూడదు. దేశంలోని భిన్న పర్యాటక ప్రాంతాల్లో టూరిస్టుల భద్రతకు ఎటువంటి కార్యాచరణ ప్రణాళిక అమలుపరుస్తున్నారో చురుగ్గా సమీక్షించి అవసరమైన మార్పులూ చేర్పులకు ఉపక్రమించాలి. పర్యాటకుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఎవర్నైనా కఠినంగా శిక్షించాలి. సందర్శకులు వచ్చి చూసి వెళ్లిపోతారులెమ్మన్న ఉదాసీన ధోరణులకు తిలోదకాలు వదలాలి. కామాంధ నరవ్యాఘ్రాల భరతం పట్టడమన్నది సంపూర్ణంగా ప్రభుత్వ బాధ్యత. అది యుద్ధప్రాతిపదికన పటుతర వ్యూహంతో సన్నద్ధం కాకపోతే పోయేది దేశం పరువే!

– బాలు

epaper.eenadu.net

# గంజాయితో ఇద్దరి అరెస్టు

దుండిగల్, న్యూస్‌టుడే: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి ఈ కేసు వివరాలు వెల్లడించారు. మేడ్చల్ జిల్లా దేవరయాంజల్‌కు చెందిన మల్లోల్ల ఆనంద్ (20) ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బిహార్‌లోని పట్నాకు చెందిన ధరమ్‌రాజ్ (26) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి బొల్లారంలో ఉంటున్నాడు. గతంలో గంజాయి తరలిస్తూ పటాన్‌చెరు పోలీసులకు ధరమ్‌రాజ్ చిక్కాడు. తన స్నేహితుల ద్వారా ఆనంద్‌కు ధరమ్‌రాజ్‌తో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఇరువురు గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్నారు. ఏపీలోని పాడేరులో ఉండే సిద్ధు నుంచి ధరమ్‌రాజ్ గంజాయి కొనుగోలు చేసి గత నెల 31న రైలులో సికింద్రాబాద్‌కు చేరుకున్నాడు. అనంతరం బస్సులో గండిమైసమ్మ చౌరస్తాకు వచ్చాడు. అప్పటికే ఆనంద్ అక్కడ ఉన్నాడు. అక్కడ పోలీసులు మాటువేసి వీరిని పట్టుకున్నారు. వీరి నుంచి 6.4 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

Date : 02/04/2023 EditionName : ANDHRA PRADESH ( ALLURI SEETARAMARAJU ) PageNo :

epaper.eenadu.net

# స్టేషన్‌లోని సొత్తు కొట్టేసింది పోలీసులే

- 81.52 కిలోల వెండి, రూ.10 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నాం
- ఎస్పీ సిద్ధార్థ కౌశల్ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సిద్ధార్థ కౌశల్. పక్కన అదనపు ఎస్పీ ప్రసాద్

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసులే దొంగలుగా మారారు. ఓ కేసులో స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన సొత్తును గుట్టుగా చోరీచేశారు. కర్నూలు తాలుకా అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఈ ఉదంతం చోటుచేసుకుంది. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఈ కేసు వివరాలు వెల్లడించారు. 2021 జనవరి 27న తమిళనాడు వ్యాపారి భారతి గోవింద్‌రాజ్ ఎలాంటి పత్రాలు లేకుండా 105 కిలోల వెండి, రూ.2.05 లక్షల నగదు రవాణా చేస్తుండగా పట్టుకుని సీజ్ చేశారు. కర్నూలు తాలుకా అర్బన్ పోలీసుస్టేషన్‌లో సొత్తును భద్రపరచగా 2022లో అదే స్టేషన్‌లో రైటర్‌గా పనిచేసిన హెడ్ కానిస్టేబుల్ అమరావతి, కానిస్టేబుల్ రమణబాబు దానిపై కన్నేసి చోరీకి కుట్రపన్నారు. అదే సంవత్సరం మే 24న ఆ స్టేషన్‌లో జప్తు చేసిన అక్రమ మద్యాన్ని ధ్వంసం చేసే కార్యక్రమం చేపట్టారు. ఇదే అదనుగా నిందితులు వెండి, నగదు అపహరించారు. తర్వాత బంగారం దుకాణం నిర్వహించే అమరావతి బంధువు భరత్ సింహా ద్వారా విక్రయించారు. ఇటీవల తమిళనాడు వ్యాపారి వెండి కోసం రావటంతో సొత్తు మాయమైన విషయం వెలుగు చూసింది. నిందితులు రమణబాబు, అమరావతి, ఆమె భర్త విజయ్‌భాస్కర్, అతని తమ్ముడు భరత్‌సింహాలను అరెస్టు చేశారు. వారి నుంచి 81.52 కిలోల వెండి, రూ.10 లక్షల నగదు రికవరీ చేశారు. అమరావతి ప్రస్తుతం కౌతాళం పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తుండగా, రమణబాబు కోడుమూరు పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇదంతా జరిగిందని, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెప్పారు.

Date : 02/04/2023 EditionName : ANDHRA PRADESH( VISAKHAPATNAM ) PageNo :



శుభోదయం